# బిజెపికి గడ్డం నాగరాజు రాజీనామా

- గులాబీ చెంత చేరేందుకు రంగం సిద్ధం

మానకొండూరు, అక్టోబర్ 28, (మనం న్యూస్): భారతీయ జనతా పార్టీ మానకొండూరు నియోజకవర్గ ఇంచార్జి గడ్డం నాగరాజు పార్టీ పదవి, సభ్యత్వానికి రాజీనామా చేశారు. త్వరలో ఆయన అనుచరులతో కలిసి బిఆర్ఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమక్షంలో ఆరు వందల మంది బిజెపి కార్యకర్తలు, ఆయన అనుచరులతో కలిసి గులాబీ చెంతన చేరనున్నారు. గత రెండు సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మానకొండూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా బరిలో దిగిన నాగరాజుకు ఈ సారి కూడా అవకాశం వస్తుందని ఆశించారు. అయితే బిఆర్ఎస్ నుంచి బిజెపిలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌కు బిజెపి అధిష్టానం



అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో గడ్డం నాగరాజు తీవ్ర నిరాశకు లోనయ్యారు.

**బిఆర్ఎస్ నుంచి ఆహ్వానం**

బిజెపికి రాజీనామా చేసిన గడ్డం నాగరాజును బిఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తూ ఆ పార్టీకి చెందిన నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షులు జివి.రామకృష్ణారావులతో పాటు ఇతర నాయకులు నాగరాజును కలిసి బిఆర్ఎస్‌లో చేరాలని ఆహ్వానించారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన ఆయన దాదాపు ఆరు వందల మంది బిజెపి నాయకులు, కార్యకర్తలతో పాటు నియోజకవర్గంలోని తన అభిమానులతో బిఆర్ఎస్‌లో చేరనున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



చిగురుమామిడి, అక్టోబర్ 28, (మనం న్యూస్): హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పొన్నం ప్రభాకర్‌ను పార్టీ అధిష్టానం ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ చిగురుమామిడి మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలో బాణా సంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కంది తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టుమల్ల రవీందర్, డిసిసి అధికార ప్రతినిధి దాస రి ప్రవీణ్‌కుమార్, మండల ఇంచార్జి ఎస్ఎల్.గౌడ్, వివిధ గ్రామ శాఖల అధ్యక్షులు వంగ కనుకయ్య, పూదరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి గెలుపు కోసం తనయుడి ప్రచారం

- గడపగడపకు ప్రచారంలో విజిత్‌రావు



మంచిర్యాల, అక్టోబర్ 28, (మనం న్యూస్): ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావును గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడు విజిత్‌రావు ప్రచార సరళిని కొనసాగిస్తున్నారు. శనివారం స్థానిక 34వ డివిజన్‌లో గడపగడపకు ప్రచారం సాగించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ మరోసారి అవకాశమివ్వాలని కోరుతూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లు సురేష్ బల్దా, మందంశెట్టి సత్యనారాయణ, గాదె సత్యం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమం బిఆర్ఎస్‌తోనే సాధ్యం

- హుస్నాబాద్‌లో మరోసారి గులాబీని గుభాళింపజేయాలి
- ఎంపిపి కొత్త వినీత



చిగురుమామిడి, అక్టోబర్ 28 (మనం న్యూస్): రాష్ట్రంలోని మహిళల సాధికారత, సంక్షేమం బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని చిగురుమామిడి ఎంపిపి కొత్త వినీత శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం అమలవుతోన్న సంక్షేమం, అభివృద్ధి ఫలాలు నిరంతరం కొనసాగేలా మరోసారి బిఆర్ఎస్‌ను కలిసికట్టుగా గెలిపించుకోవాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే, హుస్నాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీష్‌కుమార్ ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశాలను మండలంలోని సుందరగిరి, ఉల్లంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో మహిళలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వినీత మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతోన్న సతీష్‌కుమార్‌కు మద్దతు పలికేందుకు మండలంలోని ప్రతి మహిళ కదిలిరావాలని పిలుపునిచ్చారు. సతీష్‌కుమార్‌ను ముచ్చటగా మూడోసారి గెలిపించి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్ పర్సన్ రామోజీ రజిత కృష్ణమాచారి, మండల బిఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షులు అందె సుజాత, ఉల్లంపల్లి సర్పంచ్ చెప్యాల మమతా శ్రీనివాస్, కొండాపూర్ సర్పంచ్ పెద్దపల్లి భవాని అరుణ్‌కుమార్, సుందరగిరి దేవస్థానం డైరెక్టర్ వెంకటలక్ష్మి, బిఆర్ఎస్ మహిళా విభాగం గ్రామ అధ్యక్షులు కక్కెర్ల లక్ష్మి, వార్డు సభ్యులు బొల్లి సుమలత, శిరోమణి, మేడబోయిన రజిత, బత్తిన విజయ తదితరులు పాల్గొన్నారు.

## ప్లంబర్లకు విద్యుత్ టూల్ కిట్ల పంపిణీ



మెట్‌పల్లి టౌన్, అక్టోబర్ 28 (మనం న్యూస్): ఎస్ఎస్ఎస్ ఎలక్ట్రికల్ సానిటరీ సంస్థ నిర్వాహకులు, మెట్ పల్ల ప్లంబర్ల సంఘం అధ్యక్షులు అబ్దుల్ జావిద్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లకు శనివారం విద్యుత్ టూల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జావిద్ మాట్లాడుతూ తమ వద్దకు వచ్చే ఎలక్ట్రిషియన్లు, ప్లంబర్లకు గత పదేళ్లుగా విద్యుత్ టూల్ కిట్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిషియన్ సంఘం పట్టణాధ్యక్షులు మీర్జా అజిబుల్లాబేగ్, ఉపాధ్యక్షులు సంగర్తి రవి, కోశాధికారి సయ్యద్ అబీద్, సభ్యులు మజీద్, ఎండి. షర్ఫొద్దీన్, నేరేళ్ల నరేష్, చిలువేఇ మధుసూధన్, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల బైక్ ర్యాలీ



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 28, (మనం న్యూస్): సమాజంలో శాంతి పరిరక్షణకు అసాంఘిక శక్తులతో జరిగిన పోరాటంలో అసువులు బాసిన అమరవీరులను స్మరించుకుంటూ వారి జ్ఞాపకార్థంగా శనివారం పోలీసులు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సర్దాపూర్‌లోని బెటాలియన్ మెయిన్ గేటు నుంచి ప్రారంభమైన ర్యాలీ జగ్గారావు పల్లె నుండి పెద్దూరు మీదుగా సిరిసిల్ల వరకు కొనసాగింది. 'పోలీస్ అమరవీరులకు-జోహార్ జోహార్' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ లుఎ. జయప్రకాశ్ నారాయణ, యమ్. పార్థసారథి రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరికలు



మంచిర్యాల, అక్టోబర్ 28, (మనం న్యూస్): స్థానిక పాత మంచిర్యాలలో బిఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు శనివారం గడప గడపకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాత మంచిర్యాలకు చెందిన కాంగ్రెస్, బిజెపి కార్యకర్తలు బిఆర్ఎస్ యువ నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్‌ల సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు.

## అవినీతి రహిత అభివృద్ధి, సంక్షేమం కోసం బిజెపిని గెలిపించండి

- వెరబెల్లి స్రవంతి



మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 28, (మనం న్యూస్): రాష్ట్రంలో అవినీతి రహిత ప్రభుత్వం ఏర్పడి, అన్ని ప్రాంతాల అభివృద్ధి, ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే బిజెపిని గెలిపించాలని జిల్లా బిజెపి అధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ సతీమణి స్రవంతి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని పాత గర్మిళ్ల, గాయత్రి కాలనీల్లో ఆమె ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా అన్ని రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కమలం పువ్వుపై ఓటు వేసి బిజెపిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కాశెట్టి నాగేశ్వర్‌రావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్పీడ్ పెంచిన కమలం

- విస్తృతంగా ఆరెపల్లి మోహన్ ప్రచారం

తిమ్మాపూర్, అక్టోబర్ 28, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గంలో కమలనాథులు ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నారు. ఆ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ నియోజకవర్గ వ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు నిర్వహిస్తూ ప్రచార సరళిని కొనసాగిస్తున్నారు. శనివారం తిమ్మాపూర్ మండలం అల్గునూరు శ్రీ వేంకటేశ్వరకాలనీలోని పంచముఖ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన ప్రచారం నిర్వహించడంతో పాటు బూత్ కమిటీ, శక్తి కేంద్రాల సభ్యులతో సమావేశాలను నిర్వహించారు. అల్గునూరు, ఎల్ఎండి కాలనీలో ఇంటింటికి తిరుగుతూ తనకు ఓటు వేసి విజయాన్నందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ సురక్షిత సంక్షేమ పాలనను అందించే బిజెపికి మద్దతిచ్చి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపిని బలపరుస్తూ కమలం గుర్తుపై ఓటు వేయాలని ఆయన కోరారు. నేడు రాష్ట్రంలో కొనసాగుతోన్న నిరంకుశ అవినీతి పాలనకు చరమగీతం పాడాలంటే కేవలం బిజెపి మాత్రమే ప్రత్యామ్నాయమని ఓటర్లకు తెలిపారు. రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలం



టే డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటు వేసి అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, మాజీ జడ్పిటిసి సభ్యులు ఎడ్ల జోగిరెడ్డి, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్‌చంద్ర, నాయకులు పల్లాడి రఘునాథరావు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం

- వేములవాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్



వేములవాడ, అక్టోబర్ 28, (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వేములవాడలో విలీనమైన కోనయిపల్లిలో గడపగడపకు కాంగ్రెస్ కర పత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ నేటి రాష్ట్ర ప్రభుత్వాం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు ఆలోచించే విషయం ఎంతో ఉందన్నారు. నేను నాలుగు సార్లు ఓడిపోయిన మీలో ఒకరిగా ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ మీ కష్టసుఖాల్లో పాల్గొన్నానని, ఈసారి నాకు ఒక్క అవకాశం ఇచ్చి కాంగ్రెస్ పార్టీ చేతు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు చిలుక రమేష్, సాయిని అంజయ్య, కూరగాయల కొమురయ్య, కనికరపు రాకేష్, లింగంపల్లి కిరణ్, సాబీర్, వస్తాది కృష్ణ, నీలం గురవయ్య, గంటల ప్రకాష్, గోలి తిరుపతి, కూర దేవయ్య, షేక్ ఫిరోజ్, గికూర సాయి తదితరులు పాల్గొన్నారు.

## బాల్క సుమన్ ఇంటింటా ప్రచారం



మంచిర్యాల, అక్టోబర్ 28, (మనం న్యూస్): చెన్నూరు నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ శనివారం చెన్నూరు పట్టణంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా పట్టణంలోని శ్రీ అంబ అగస్తేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోటపల్లి బస్టాండ్ ఏరియా, గాంధీ చౌక్, పాత బస్టాండ్ ఏరియా, కొత్త బస్టాండ్ ప్రాంతం, పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం సాగించారు. దీంతో పాటు వర్తక, వాణిజ్య సముదాయాల్లో కలియ తిరుగుతూ బిఆర్ఎస్ మెనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు భవిష్యత్‌లోనూ కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు అఖిల భారత హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞం

- హిందూ సమితి ప్రధాన కార్యదర్శి రవీందర్



మంచిర్యాల, అక్టోబర్ 28, (మనం న్యూస్): మంచిర్యాల పట్టణంలో తిరుమల తిరుపతి దేవస్థానం, అఖిల భారత హనుమాన్ దీక్షా పీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30న కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞాన్ని నిర్వహించనున్నట్లు మంచిర్యాల హిందూ సమితి ప్రధాన కార్యదర్శి కర్ణకంటి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న కోటి హనుమాన్ చాలీసా పారాయణంలో భాగంగా వస్తోన్న హనుమాన్ చాలీసా ప్రచార రథానికి ఘన స్వాగతం పలకాలని కోరారు. సోమవారం సాయంత్ర ఐదు గంటలకు స్థానిక ఐబి చౌరస్తా హనుమాన్ విగ్రహం దగ్గరి నుంచి దేవాలయ రథయాత్ర కొనసాగనుందని, అనంతరం ఆలయంలో దుర్గా ప్రసాద్ స్వామిటీ వారి ధార్మిక ప్రవచనం, శ్రీ శక్తి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాలొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## మడిపల్లిలో శిలాఫలకం ధ్వంసం



జమ్మికుంట, అక్టోబర్ 28, (మనం న్యూస్): మండలంలోని మడిపల్లి గ్రామంలో మిషన్ కాకతీయ పనుల నిర్వహణ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామంలోని పెద్ద చెరువులో చేపట్టిన మిషన్ కాకతీయ పనులకు సంబంధించి సర్పంచ్ నేరెళ్ల లక్ష్మిశ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో శిలాఫలకం ఏర్పాటు చేయగా దాన్ని ధ్వంసం చేశారు. ఇదివరకు కూడా ఇలాంటి ఘటనే గ్రామంలో చోటుచేసకుంది. మడిపల్లి గ్రామపంచాయితీ పరిధిలోని శాంతినగర్ కాలనీ సమీపంలోని ఫీడర్ ఛానల్ నిర్మాణ పనుల సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కూడా గతంలో ధ్వంసం చేసిన ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. తాజాగా మిషన్ కాకతీయ పనుల శిలాఫలాకాన్ని కూడా గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో గ్రామంలో ఆందోళన వ్యక్తమవుతోంది. శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్న వారికి తక్షణమే గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



మెట్ పల్లి, అక్టోబర్ 28, (మనం న్యూస్): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని డిఎంఓ ప్రకాష్, మార్క్‌ఫెడ్ డిఎం దివ్యభారతిలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించేందుకు ఏర్పాటు చేస్తోన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళారుల బారిన పడకుండా కొనుగోలు కేంద్రాల్లో పంటలను విక్రయించి లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రమణ, జెట్టి నరసయ్య, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీలో భారీ చేరికలు



జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 28, (మనం న్యూస్): జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం అర్పపల్లి గ్రామానికి చెందిన మండల బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ దులూరి వంశీతో పాటు ఆ పార్టీకి 150 మంది కార్యకర్తలు, పెంబట్ల, ధర్మానాయక్ తండాకు చెందిన పలువురు యువకులు సారంగాపూర్ మండల అధ్యక్షులు ఎండబెట్ల వరుణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా బిజెపి అభ్యర్థి డాక్టర్ బోగ శ్రావణి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జగిత్యాల పట్టణ అధ్యక్షులు వీరభత్తిని అనిల్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దెల గంగరాజు, సారంగాపూర్ మండల కోశాధికారి బొమ్మ కంటి ప్రమోద్, సారంగాపూర్ మండలం ఉపాధ్యక్షులు గొల్లపల్లి తిరుపతి, సారంగాపూర్ మండల బిజెపి అధ్యక్షులు దిటి వెంకటేష్, మండల గిరిజన మోర్చా నాయకులు అనిల్, నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొమరం భీమ్ ఆశయాలను సాధించాలి

- మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్



లక్షెట్టిపేట్, అక్టోబర్ 28, (మనం న్యూస్): కొమరం భీమ్ ఆశయాలను సాధించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం అన్ని కులసంఘాల ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని కరీంనగర్ చౌరస్తా వద్ద కొమరం భీం వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో ఆదివాసీలను ఒక్క తాటిపై నడిపించిన ఘనత కొమరం భీమ్ కే దక్కుతుందన్నారు. ఆదివాసీలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. అన్ని వర్గాలకు ఆదర్శప్రాయుడు కొమరం భీముడని కొనియాడారు. కొమరం భీం చేసిన సేవలు వెలకట్టలేనివని తెలిపారు. పలువురు ఆదివాసీ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కొమరం భీం ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో, ఆత్మాభిమానంతో జీవించాలన్నారు. కొమరం భీం చరిత్రను అధ్యయనం చేయాలని, ప్రభుత్వం కొమరం భీంకు మరింత ప్రాధాన్యతను కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి సోయం జంగు, మండల అధ్యక్షుడు జుగునాక సూర్ పటేల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుద్ధి చిన్నయ్య, నాయి బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి కళ్యాణపు రవి, ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు మెస్రం చిత్రు,తానిమడుగు సర్పంచ్ పెంద్రం శ్రీనివాస్,పద్మపూరికోకో ఆలయ కమిటీ చైర్మన్ కుడ్మత సోము, టీచర్ మాడవి శంకర్, తుడుం దెబ్బ కమిటీ మెంబర్ కోవ చందు, కుర్సింగ బారిక్ రావు, బుద్ధె శ్రీనివాస్, మెట్టు రాజు, కౌన్సిలర్ సురేష్ నాయక్, పాల్గొన్నారు.

## దోచుకోవడం కాంగ్రెస్ పాలసీ.. పేదల సంక్షేమం బిఆర్ఎస్ ధ్యేయం

- మంత్రి కొప్పుల ఈశ్వర్



వెల్గటూర్, అక్టోబర్ 27, (మనం న్యూస్): దోచుకోవడమే కాంగ్రెస్ పాలసీ అని,పేద ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ పాలసీ అని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఎస్సార్ గార్డెన్లో ఏర్పాటుచేసిన పార్టీ చేరికల కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాజీ బిజెపి మండల అధ్యక్షుడు తంగళ్ళపల్లి చక్రపాణి 600 మంది అనుచర గణం తో బీఆర్ఎస్ పార్టీలో చేరగా మంత్రివారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్తు, మద్దతు ధర,రైతుబంధు,రైతు బీమా, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ బీసీ బంధు దళిత బంధు, గృహ లక్ష్మీ లాంటి పథకాలు ప్రవేశపెట్టామని, రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆసరా పింఛన్లు, మహిళలకు సబ్సిడీ సిలిండర్ సన్న బియ్యం వంటి పథకాలను అమలు చేస్తామని అన్నారు. దళిత బంధు పథకాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తుందని రాష్ట్రంలో ఉన్న దళిత కుటుంబాలకు దళిత బందును వర్తింప చేస్తామని ధర్మపురి నియోజకవర్గానికి 2100 దళిత బంధు యూనిట్లు మంజూరు అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ పత్తిపాక వెంకటేష్ పార్టీ అధ్యక్షులు సింహాచలం జగన్ రామచందర్ గౌడ్, నాయకులు సంగ రమేష్, జీరెడ్డి మహేందర్ రెడ్డి, మెరుగు జానీ, వ్యాల్ల రామిరెడ్డి, ఏలేటి చంద్రారెడ్డి, తిరుమలాచారి, రామగిరి మల్లేష్, రెండ్ల కృష్ణ, మహ్మద్ రియాజ్,గంధం భాస్కర్ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూండా రాజ్యం రావాలా...? సంక్షేమ ప్రభుత్వం కావాలా...?

- కాంగ్రెస్ ను గెలిపిస్తే జాఫర్ జమాన పునరావృతమవుతుంది...
- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని, అక్టోబర్ 28, (మనం న్యూస్): కాంగ్రెస్ గెలిస్తే గూండా రాజ్యం వస్తుంది..బిఆర్ఎస్ ను గెలిపిస్తే సంక్షేమ ప్రభుత్వం వస్తుందని, ఏది కావాలో విజ్ఞతగా ఆలోచించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సింగరేణి సంస్థ ఆర్జీ-1 పరిధి జీడీకే 11ఇంక్లైన్ గనిపై శనివారం జరిగిన గేటు మీటింగ్ లో కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ 55 సంవత్సరాల పాటు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బోఫోర్స్ కుంభకోణాలు, అవినీతి,అక్రమాలు, గూండా గిరి, రౌడీయిజమే రాజ్యమేలాయన్నారు. గోదావరిఖనిలో జాఫర్ జమానాను ప్రోత్సహించింది కాంగ్రెస్ పార్టీ అని, కాంగ్రెస్ ని గెలిపిస్తే జాఫర్ జమానా మళ్లీ పునరావృతమవుతుందని అన్నారు. రామగుండం నియోజకవర్గ ప్రజలు రౌడీయిజానికి, గూండాగిరికి వత్తాసు పలకరని, కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ఈనగాచి నక్కల పాలైనట్లు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ఆనాడు చంద్రబాబు నాయుడు కార్మికుల ఉద్యోగాలను ఊడగొట్టి, కార్మిక హక్కులను కాలరాసి రోడ్డు మీద పడవేస్తే, వైయస్ రాజశేఖర్ రెడ్డి గోల్డెన్ షేక్ హ్యాండ్ పేరిట కార్మికులకు తీరని అన్యాయం చేసారన్నారు. వారు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను కారుణ్య నియామకాల పేరుతో పునరుద్ధరించి, ఛిద్రమైన కుటుంబాలను, చితికిపోయిన జీవితాలను కాపాడిన మహా నాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఉద్యమ సమయంలో గోదావరిఖనిలో నిర్వహించిన సింగరేణి సింహగర్జనలో వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరిస్తామని మాట ఇచ్చి అధికారంలోకి రాగానే నిలబెట్టుకున్న నేత మన ముఖ్యమంత్రి కేసీఆర్ ని అన్నారు.కేసీఆర్ తోనే సింగరేణి పరిరక్షణ సాధ్యమని, వారిని మరో మారు గెలిపించడానికి కార్మిక వర్గం అంతా ఒక్కతాటిపైకి వచ్చి ప్రతిజ్ఞ పూనాల్సిన సందర్భం వచ్చిందన్నారు.వారసత్వ ఉద్యోగాలు పొందిన వారు కేసీఆర్‌కి కృతజ్ఞతగా కారు గుర్తుపై ఓటు వేసి హ్యాట్రిక్ ముఖ్యమంత్రిని చేయాలన్నారు.తన జీవితం ప్రజలకే అంకితమని, నియోజకవర్గంలో మరిన్ని సౌకర్యాల కల్పన కోసం కారు గుర్తుపై ఓటు వేసి, తనను ఆశీర్వదించి మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించి సేవ చేసే అదృష్టాన్ని కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, టీబీజీకేఎస్, బిఆర్ఎస్ నాయకులు నాయిని శంకర్, గంద్ర దామోదర్ రావు, మాదాసు రామ్మూర్తి, జాహిద్ పాషా, వడ్డేపల్లి శంకర్, కనకం శ్యామ్ సన్, మూల విజయా రెడ్డి, శశి, పుట్ట రమేష్, జోసెఫ్, కెనడి, సప్పిడి రామస్వామి, బాల రాజ్ కుమార్, గంగరాజు, పోలాడి శ్రీనివాసరావు, పీచర శ్రీనివాస్, నారాయణదాసు మారుతి, నర్సింగరావు, తిరుపతి, కుల్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌కు గోలి మోహన్ రాజీనామా

- బిఎస్పీ అభ్యర్థిగా బరిలో నిలువనున్నట్లు ప్రకటన



వేములవాడ, అక్టోబర్ 28, (మనం న్యూస్) : ప్రముఖ సైంటిస్ట్, ఆధ్య గోలి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గోలి మోహన్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో మీడియా సమావేశంలో రాజీనామా విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాష్ట్ర సమితి శాశ్వత సభ్యత్వానికి, అమెరికా అడ్వైజరీ బోర్డుకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 2001 నుంచి భారత రాష్ట్ర సమితిలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి తెలంగాణ ఉద్యమం కోసం కేసిఆర్ తో కలిసి సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్నానని తెలిపారు. నీళ్లు నియమకాలు, నిధులు అనే నినాదంతో తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించానన్నారు.నాలాంటి ఎంతో మంది యువకులు,పేద ప్రజలు తెలంగాణ వచ్చాక తమ బతుకులు మారుతాయని,భవిష్యత్తు బాగుంటుందని కేసిఆర్ అడుగులో అడుగేసుకుంటూ ఉద్యమానికి బిఆర్ఎస్ పార్టీకి ఎల్లవేళలా పని చేశామని తెలియజేశారు. ప్రపంచ దేశాల్లో ఉన్న కూడా పార్టీ కోసం అనునిత్యం పని చేశానని, తెలంగాణ వచ్చాక కూడా నా వంతు సహకారాన్ని ఈ రాష్ట్రం ఆర్థికంగా ఎదగడానికి పారిశ్రామిక విధానాన్ని పెంపొందించడానికి కృషి చేస్తూనే ఉన్నానని పేర్కొన్నారు. ఎప్పుడు కూడా పదవుల కోసం పాకులాడకుండా పనిచేస్తూనే ఉన్నానని,కానీ బిఆర్ఎస్ పార్టీలో దొంగలు,రౌడీలకు పార్టీ ద్రోహులకు మాత్రమే స్థానాన్ని ఇస్తూ తన లాంటి వారిని చిన్న చూపు చూస్తూ ఎదగకుండా చేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు ఏదైనా మంచి పని చేయాలనుకున్నపుడు రాజకీయంగా గాని,సామాజికంగా గాని బిఆర్ఎస్ కుటుంబ పాలనను వెలమ సామాజిక వర్గాన్ని మాత్రమే ముందుకు తీసుకుపోతున్నారని మండిపడ్డారు.ఎంతోమంది బలిదానాలతో నిర్మించబడిన తెలంగాణలో బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా సామాజికంగా రాజకీయపరంగా ఎదగడానికి తోడ్పాటు అందించాలనే తన లాంటి వారికి పార్టీలో సరైన గుర్తింపు లేదని తెలిసిందన్నారు.తెలంగాణ వచ్చాక కూడ యువత బలిదానాలు చేసుకోవడం చాలా బాధాకరమని, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలు తమ పిల్లల కోసం ఉన్న భూములు అమ్ముకొని కూలీలుగా మారడం తన మనసును ఎంతో కలత చెందిందన్నారు.కష్టపడి తెచ్చుకున్న తెలంగాణలో అందరం భాగస్వాములు కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా ఎదిగే విధంగా యువకులకు ఉద్యోగ అవకాశాలు, ఉన్నత చదువులు ఉండాలని కోరుకున్నానని, పార్టీలో ఇది కూడా జరగకపోవడంతో బాధ అనిపించి భారత రాష్ట్ర సమితికి రాజీనామా సమర్పిస్తున్నానని వెల్లడించారు. తన రాజీనామా పత్రాన్ని బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆమోదించవలసిందిగా డాక్టర్ గోలి మోహన్ కోరారు. ఈ నెల 30న బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అధ్వర్యంలో పార్టీలో చేరి వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు.తనను భారీ మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బిఆర్ఎస్‌లో చేరిన కమలాపూర్ నాయి బ్రాహ్మణులు

హుజురాబాద్, అక్టోబర్ 28, (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలతో పాటు నాయి బ్రాహ్మణుల కోసం ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై ఎమ్మెల్సీ, హుజురాబాద్ టిఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో కమలాపూర్ నాయి బ్రాహ్మణులు శనివారం స్థానిక సిటీ సెంట్రల్లో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ పార్టీలో చేరిన నాయి బ్రాహ్మణులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని దాంతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. టిఆర్ఎస్ పార్టీ తోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బిజెపి లతో రాష్ట్రానికి ఒరిగేదేంలేదని అన్నారు. ఉప ఎన్నికల్లో బిజెపి తరపున గెలిచిన ఈటెల ఇప్పటివరకు నియోజకవర్గంలో పాటు సొంత గ్రామమైన కమలాపూర్ కూడా వచ్చిన పాపాన పోలేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కమలాపూర్ అన్ని రకాల అభివృద్ధి చేసిందని అన్నారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ నాయి బ్రాహ్మణుల కోసం ఉచిత కరెంటు అందించి సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ నాయి బ్రాహ్మణ అధ్యక్షుడు రాంబాబు తో పాటు పలువురు నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.



# నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



మంచిర్యాల, అక్టోబర్ 28, (మనం న్యూస్): భారతీయ జనతా పార్టీ బిసిని ముఖ్యమంత్రి గా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో సీసీసీ లో బీజెనివారం ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వెరబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ అన్ని వర్గాల సమగ్రాభివృద్ధి కేవలం భారతీయ జనతా పార్టీ తోనే సాధ్యం అన్నారు. ఒక దళితున్ని, గిరిజన మహిళను రాష్టపతి ని చేసిన ఘనత బిజెపిదేనన్నారు. తెలంగాణలో కూడా బిసిలకు న్యాయం జరగాలి, బిసిలకు ప్రాధాన్యతనీయాలన్న ఉద్దేశంతో బిసి నీ ముఖ్యమంత్రి గా ప్రకటించడం జరిగిందని, ఇది చాల సంతోషకరమైన విషయమన్నారు. ప్రదాని మోడీకి, హోమ్ శాఖా మంత్రి అమిత్ శాకు మంచిర్యాల నియోజవర్గం ప్రజల తరపున ధన్యవాదములు తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బిజెపి అధికారం లోకి రావడం, బిసి నేత ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేడు కిట్స్ వరంగల్‌లో టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్-2023 ప్రారంభం

వరంగల్, అక్టోబర్ 28, మనం న్యూస్ : కిట్స్ వరంగల్ లో నేడు వరంగల్ జిల్లా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్-2023 ఆటల పోటీలను ను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నేడు ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డబ్ల్యుడిటిటిఏ అధ్యక్షులు అకారపు హరీష్ అధ్యక్షత వహిస్తారు. నేడు వరంగల్ జిల్లా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్-2023 ని అక్టోబర్ 29-30, 2023 తేదీలలో ఇండోర్ స్టేడియం, కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ వరంగల్ (కిట్స్ వరంగల్-కిట్స్ డబ్ల్యు)లో విద్యార్థుల యువత లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం కోసం నిర్వహిస్తున్నామని అని డబ్ల్యు డిటిటిఏ అధ్యక్షులు ఆకారపు హరిష్ తెలిపారు. ఈ ఆటల పోటీలను వరంగల్ డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యుడిటిటిఏ) వారి ఆధ్వర్యంలో జరుగుతాయి. ఈ టోర్నమెంట్‌లో అండర్-11, అండర్-13, అండర్-15, అండర్-17, అండర్ 19 బాల బాలికలకు, పురుషుల, మహిళలకు టేబుల్ టెన్నిస్ పోటీలు క్రీడాకారులకు సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహిస్తారు. అని తెలిపారు. పై కేటగిరీలకి చెందిన విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని అధ్యక్షులు ఆకాంక్షించారు. ఇతర సమాచారం కోసం డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి (97052 93709), టి సురేష్ (98480 56 026), శ్రీ జై సింగ్ అజ్మీరా (99086 29146) లను సంప్రదించాలన్నారు. అతిధులుగా హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి జి. అశోక్ కుమార్, కిట్స్ వరంగల్ పరిపాలనా అధికారి ప్రొఫెసర్ పింగిలి రమేష్ రెడ్డి, డబ్ల్యుడిటిటిఏ ప్రధా న కార్యదర్శి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి (97052 93709), ఉపాధ్యక్షుడు, నిట్ వరంగల్ ప్రొఫెసర్ దయానిధి, కోశాధికారి, టి సురేష్ (98480 56026), కార్యవర్గ సభ్యులు సునీల్ కుమార్, జై సింగ్ (99086 29146), ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఫ్యాకల్టీ మహేష్, వెంకటస్వామి, నాగరాజు, హెడ్స్, డీన్లు, అధ్యాపకులు, సిబ్బంది, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ పిఅర్ఓ డాక్ట ర్ డి. ప్రభాకరాచారి ప్రారంభో త్సవ కార్యక్రమంలో పాల్గొంటార ని తెలిపారు..




## ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించరా..?

- బిసి సంఘం మండల అధ్యక్షులు మోత్కూరు శ్రీనివాస్



ఇల్లందకుంట, అక్టోబర్ 28, (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పరిపాలన సౌలభ్యం కొరకు కొత్త మండలాలను ఏర్పాటు చేసి ఏడు సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలను నిర్మించకపోవడం బాధాకరమని ఇల్లందకుంట మండల బీసీ సంఘం అధ్యక్షుడు మోత్కూరు శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు పనులు వేగవంతంగా అవుతాయని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కొత్త మండలాల్లో కార్యాలయాలకు సొంత భవనాలు లేక అనేక ఇబ్బందులేర్పడుతున్నాయన్నారు. మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఎమ్మార్సీ బిల్డింగ్, బస్ స్టేషన్, వ్యవసాయ మార్కెట్ లను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటు భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలుండడం వల్ల అద్దెలు కూడా సరిగా చెల్లించలేని పరిస్థితుల్లో ఆయా భవనాల యజమానులు గేట్లకు తాళాలు వేసిన ఘటనలు కూడా చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించడంతో పాటు అపరభద్రాద్రిగా పేరుగాంచిన శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా గెస్ట్ హౌస్‌లు ఏర్పాటు చేయడంతో పాటు రహదారిని కూడా బాగు చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## రామగుండం ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

- మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ



గోదావరిఖని,అక్టోబర్ 28, (మనం న్యూస్): రామగుండం ప్రజలు తమకు ఓటు వేసి గెలిపిస్తే పారిశ్రామిక ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక మల్కాపురం, శాలపల్లి, జంగాలపల్లిలో సత్యనారాయణ గడపగడప ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారయణకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను గెలిచాక రామగుండం ప్రాంతంలో ఉన్న సమస్యలను తీరుస్తానని అన్నారు.మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు, అలాగే 24 గంటల మంచినీటి సౌకర్యం, మెరుగైన పారిశుధ్యం,కల్పిస్తానని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు ఈ ప్రాతంలో చేసిన అభివృద్ధి చూసి ఓటు వేయాలని, ఇక్కడ రౌడీయిజం, భూకబ్జాలు, అవినీతి అంతమొందించాలంటే తిరిగి తనను మళ్ళీ ఈ ప్రాంత ఎమ్మెల్యేగా గెలిపిస్తే, ఐదు సంవత్సరాలు సుపరిపాలన అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోమరపు లావణ్య అరుణ్ కుమార్, రాజమణి, కుసుమ, సత్య ప్రకాష్, పుష్ప, కిషన్ రావు,మామిడాల చంద్రయ్య, భరత్, వడ్లూరిరవి, మంచుకట్ల బిక్షపతి, పిడుగు కృష్ణ, సుభాష్, డేవిడ్, చంద్ర శేఖర్, కిషోర్,సురేందరు పాల్గొన్నారు.

## ఆర్ఎఫిసిఎల్ కార్మికులకు అండగా ఉంటా



గోదావరిఖని, అక్టోబర్ 28 (మనం న్యూస్): దళారుల చేతిలో మోసపోయిన ఆర్ఎఫ్‌సిఎల్ కాంట్రాక్ట్ కార్మికులకు అండగా ఉంటానని రామగుండం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. శనివారం రామగుండం ఎరువుల కర్మాగారం గేటు వద్ద కాంట్రాక్టు కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ఉద్యోగాల పేరిట అధికార పార్టీ నాయకులు వేల సంఖ్యలో యువకులను మోసం చేశారని అన్నారు. పర్మినెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ లక్షల్లో వసూలు చేసి ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చి చేతులుదులు పుకున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ మారడంతో కార్మికు లు వీధిన పడ్డారని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆర్ఎఫ్సిఎల్ కాంటాక్ట్ కార్మికుల నుంచి వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇస్తామని పేర్కొన్నారు. కాంటాక్ట్ కార్మికులు ఆలోచించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో భారీ ఎత్తున కాంటాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

